
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 34.0 । కనిష్ఠం : 19.0

ANDHRAJYOTHY

3



నాగర్‌కర్నూల్

జిల్లా వార్తలు

సోమవారం 3 ఫిబ్రవరి 2025

నేడు జోగులాంబ

వార్షికోత్సవాలు

- వసంత పంచమి సందర్భంగా నిర్వహణ..
- బాల బ్రహ్మేశ్వర స్వామి, అమ్మవార్ల శాంతి కల్యాణం

5



భలాన్‌పల్లిలో

సూర్యకాంతులు

- నేటి నుంచి సూర్యనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు
- రాష్ట్రంలోనే ఉన్న ఏకైక సూర్యనారాయణస్వామి ఆలయం
- ఏర్పాట్లను పూర్తి చేసిన ఆలయ కమిటీ సభ్యులు

5



తాడూరు మండలంలోని భలాన్‌పల్లిలో సూర్యనారాయణస్వామి దేవాలయం

భక్తుల ఇలవేల్పు

- స్వయంభూ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు
- నేడు కల్యాణోత్సవం .. రేపు రథోత్సవం
- ఏడు నుంచి 16వ తేదీ వరకు జాతర

5



అమడబాకుల దేవాలయంలో ఉత్సవ విగ్రహాలు

కటాఫ్‌తో కష్టాలు

- పంట కొనుగోలుకు షరతులు
- తీవ్ర ఇబ్బందుల్లో రైతులు
- పరిమితులు పెంచాలని డిమాండ్
- పరిశీలిస్తామంటున్న అధికారులు



అయిజ మార్కెట్‌కు విక్రయానికి తీసుకువచ్చిన కందులు

అయిజ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కటాఫ్‌తో కంది రైతులు కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఒక ఎకరానికి ఇంత మాత్రమే కొనుగోలు చేస్తామనటంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా 48 వేల ఎకరాల్లో కందిసాగు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురవటంతో దిగుబడి బాగానే వచ్చింది. ప్రభుత్వం సింగిల్ విండో అధ్వర్యంలో కొనుగోళ్లు జరిపేందుకు కొనుగోలు కేంద్రాలు కూడా ప్రారంభించింది. రైతులు తమ పంటను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని ఉంటే ఎకరాకు మూడు క్వింటాళ్ల 300 గ్రాములు మాత్రమే తీసుకుంటామనే నిబంధనతో ఇబ్బంది వస్తోంది. నాణ్యత ప్రమాణాలు కలిగి ఉండి 12లోపు తేమశాతం ఉంటే ప్రభుత్వం మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,550 చెల్లిస్తుంది. కానీ ఆన్‌లైన్‌లో పంట నమోదు చేయించుకున్న రైతుల నుంచి మాత్రమే కొనుగోలు చేస్తుంది.

రైతులకు వచ్చిన చిక్కు..

కంది రైతులకు వచ్చిన చిక్కంతా పంట కొనుగోళ్లకు పరిమితులు విధించటం, అధికారుల ఆన్‌లైన్ నమోదు సక్రమంగా చేయకపోవడం ప్రధానంగా ఉంది. అధికారులు పంట దిగుబడి కొనుగోళ్లకు పరిమితులు విధించారు. ఎకరాకు మూడు క్వింటాళ్ల 300 గ్రాములు మాత్రమే కొంటామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ సారి వర్షాలు సమృద్ధిగా కురవటంతో కంది దిగుబడి బాగానే వచ్చింది. ఎకరాకు వర్షాధారంగా 5 క్వింటాళ్ల నుంచి ఏడు క్వింటాళ్ల వరకు వచ్చింది. కంది పంటే ప్రధానంగా సాగుచేసి పంటకు నీరు పెట్టిన రైతులకు ఎకరాకు 11 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చినట్లు రైతులు చెబుతున్నారు. ఎకరాకు మూడు క్వింటాళ్ల మాత్రమే ప్రభుత్వం మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తే మిగితా ఏడు క్వింటాళ్ల కందులు ఎక్కడ అమ్ముకోవాలని రైతులు ప్రశ్నిస్తున్నారు.

కొనుగోళ్ల పరిమితి పెంచాలి

కొనుగోలు కేంద్రాలలో పంట కొనుగోలు పరిమితి పెంచాలి. పంట దిగుబడి ఎకరాకు 11 క్వింటాళ్ల వరకు వచ్చింది. మూడు క్వింటాళ్ల మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేస్తే మిగతా ఎనిమిది క్వింటాళ్ల ఎక్కడ అమ్ముకోవాలి. ఇది ఇబ్బంది గానే ఉంటుంది. పరిమితిని పెంచి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి.

- క్రిష్ణ, రైతు పర్దిపూర్

ప్రభుత్వ అనుమతుల మేరకు కొనుగోలు చేస్తాం



ప్రభుత్వం నిర్దేశించిన మేరకు పంట కొనుగోలు చేస్తాం. వ్యవసాయా విస్తరణ అధికారులు పంట నమోదు చేయటం జరిగింది. ఎకరాకు మూడు క్వింటాళ్ల 300 గ్రాముల కందులు రైతులకు మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తాం.

- జనార్దన్, మండల వ్యవసాయాధికారి, అయిజ

ప్రతిపాదనలు పంపించాం



కందుల కొనుగోళ్ల పరిమితులు పెంచాలని ప్రతిపాదనలు పంపించాం. ప్రస్తుతం మూడు క్వింటాళ్లకు బదులు ఐదు క్వింటాళ్ల కొనుగోలు కోసం అనుమతులు కోరాము.

- దొడ్డప్ప, అలంపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్

కల్యాణం.. కమనీయం



స్వామి వారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

5

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల్లో నైరాశ్యం

- మంజూరు పత్రాలు వెనక్కి తీసుకున్న అధికారులు



అధికారుల చేతుల మీదుగా మంజూరు పత్రాలు అందుకుంటున్న లబ్ధిదారులు (ఫైల్)

5

గల్లంతైన బాలుడి మృతదేహం లభ్యం



చిన్నారి మహేష్ మృతదేహాన్ని తీసుకొస్తున్న కానిస్టేబుల్

5

వివాదాస్పదంగా మారిన

బైపాస్

- కల్వకుర్తి, నంద్యాల జాతీయ రహదారి బైపాస్ రోడ్డుకు భూములు ఇవ్వబోమని రైతుల ఆందోళన
- శనివారం సర్వే చేస్తుండగా ఆత్మహత్యాయత్నాలు
- ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భూనిర్వాసితులు
- పోలీసు బందోబస్తు మధ్య సర్వే పూర్తి చేసిన అధికారులు
- నష్ట పరిహారం ప్రకటించలేదంటున్న నిర్వాసితులు



జాతీయ రహదారికి సంబంధించిన సర్వే అనంతరం కడీలు పాతి హద్దులు ఏర్పాటు చేసిన అధికారులు

4

మైసమ్మ దర్శనం కోసం పోటెత్తిన భక్తులు

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలోని నాయినోనిపల్లి గ్రామ శివారులో వెలసిన మైసమ్మ దేవత దర్శనం కోసం ఆదివారం భక్తులు పోటెత్తారు. నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల, నారాయణపేట జిల్లా నుంచే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ ఆదివారం దాదాపు 20వేల మందికిపైగా భక్తులు దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల నుంచి టికెట్ల ద్వారా 42,531రూపాయలు, హుండీ ద్వారా 99,121రూపాయలు, మొత్తం ఒక లక్ష 41,652రూపాయల ఆదాయం వచ్చినట్లు చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, ఈవో రామేశ్వర్‌శర్మలు తెలిపారు.



నాయినోనిపల్లి మైసమ్మ దేవతను దర్శనం చేసుకుంటున్న భక్తులు

కొల్లాపూర్ మండలంలో

పెరిగిన ఎంపీటీసీ స్థానం

- మునిసిపాలిటీ విలీన గ్రామాలను పంచాయతీలుగా గుర్తింపు
- 9 నుంచి 10 కి చేరిన ఎంపీటీసీ స్థానాలు



కొల్లాపూర్ మండల పరిషత్ కార్యాలయం

కొల్లాపూర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలో ఎంపీటీసీల సంఖ్య 9 నుంచి 10కి చేరింది. కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలో ఉన్న తాళ్ల నరసింహాపురం, బోయలపల్లి గ్రామాలను గ్రామ పంచాయతీలుగా గుర్తించారు. గతంలో కొల్లాపూర్ మండలంలోని సింగోటం ఎంపీటీసీ పరిధిలో ఉన్న మాచినేనిపల్లి గ్రామాన్ని బోయలపల్లి, తాళ్ల నరసింహాపురం గ్రామంతో కలుపుతూ తాళ్ల నరసింహాపురం గ్రామ ఎంపీటీసీ స్థానంగా గుర్తించినట్లు కొల్లాపూర్ ఇన్‌చార్జి ఎంపీడీవో భాస్కర్ స్పష్టం చేశారు. గతంలో కొల్లాపూర్ మండలంలోని 9 ఎంపీటీసీ స్థానాలు ఉండగా పెరిగిన ఎంపీటీసీ స్థానంతో ఆ సంఖ్య 10 కి చేరింది. కొల్లాపూర్ మండలంలోని మొత్తం 18 గ్రామాలు 33,832 మంది జనాభాతో పది ఎంపీటీసీ స్థానాలుగా విభజించినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా కొల్లాపూర్ మండలంలోని మొలచింతలపల్లి గ్రామ ఎంపీటీసీ ఆధీనంలో ఉన్న ముక్కిడిగుండం గ్రామాన్ని విభజిస్తు ప్రత్యేకంగా ముక్కిడిగుండం గ్రామం ఎంపీటీసీ స్థానం కేటాయించాలని జిల్లా అధికారులకు ప్రజాప్రతినిధులకు ఆ గ్రామస్థులు చేసిన వినతులు విఫలమయ్యాయి. కేవలం మునిసిపాలిటీ పరిధిలో ఉన్న విలీన గ్రామాలను గ్రామ పంచాయతీలుగా గుర్తిస్తూ తాళ్ల నరసింహాపురం ఎంపీటీసీ స్థానాన్ని అధికారులు ధ్రువీకరిస్తు ప్రకటన విడుదల చేశారు.

ప్రణాళికతో..

గ్రామాల అభివృద్ధి

- అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ



అంబేడ్కర్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

బల్మూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధికి పూర్తిస్థాయిలో ప్రణాళికలతో కృషి చేస్తు న్నామని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృ ష్ణ అన్నారు. ఆదివారం మం డల పరిధిలోని గోదల్ గ్రా మంలో అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ. 5లక్షల రూపాయలతో శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామ సమీపంలో ఉన్న రామలింగేశ్వర స్వామి ఆలయ అదనపు హాలుతో పాటు ప్రాంగణంలోని వివిధ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ గ్రామంలో పది లక్షల రూపాయలతో అంతర్గత సీసీ రోడ్ల పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గోదల్ నుంచి నర్సాయిపల్లికి రూ.ఐదు లక్షలతో, మహాదేవ్‌పూర్ నుంచి గోదల్‌కు రూ. మూడు లక్షల78వేలతో పనులు చేపడుతారని తెలిపారు. కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు జంగయ్య, శంకరయ్య, మాణిక్ బాబు, సుధాకర్ గౌడ్, శ్రీపతిరావు, పీఆర్‌ఈ శ్రీనివాసులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎస్పీ రావుల గిరిధర్, లీగల్ అడ్వైజర్

కొత్త చట్టాల ద్వారా

కేసుల దర్యాప్తు వేగవంతం

- ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి క్రైం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కొత్త చట్టాలపై పోలీస్ అధికారులకు పూర్తిగా అవగాహన ఉండాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లాలోని పోలీస్ అధికారులకు రాష్ట్ర పోలీస్ లీగల్ అడ్వైజర్ రాములు కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా అమలులోకి వచ్చిన నూతన చట్టాలను పోలీస్ శాఖ సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. నూతన చట్టాలపై కిందిస్థాయి సిబ్బంది నుంచి ఉన్నతస్థాయి అధికారుల వరకు అందరూ సంపూర్ణ పరిజ్ఞానం కలిగి ఉండాలని సూచించారు. నూతన సెక్షన్ల ప్రకారం మాత్రమే వివిధ రకాల కేసులను నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం తెలంగాణ పోలీస్ లీగల్ అడ్వైజర్ రాములు కొత్త చట్టాలలో వచ్చిన మార్పులను అధికారులకు , సిబ్బందికి వివరించారు. అనంతరం రాములును ఎస్పీ సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వరరావు, డీసీఆర్‌బీ డీఎస్పీ ఉమామహేశ్వరరావు, సీఐలు కృష్ణ, రాంబాబు, శివకుమార్, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌ల ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన పోలీస్ అధికారులు

కోరిన కోరికలు తీర్చే

జములమ్మ తల్లి

- రేపు పుట్టినిల్లు గుర్రంగడ్డకు ఎద్దుల బండి
- మరుసటి రోజు మెట్టినింటికి అమ్మవారు
- 12వ తేదీ పౌర్ణమికి ప్రత్యేక ఏర్పాట్లు
- రంగులు అద్ది ప్రత్యేక అలంకరణలో ఆలయం
- భక్తులకోసం ప్రత్యేక బస్సులు నడపనున్న ఆర్టీసీ



విద్యుద్దీపాలంకరణలో జములమ్మ దేవస్థానం

4

ఘనంగా చెన్నకేశవ స్వామి తిరుకల్యాణం

4

విద్యుదాఘాతంతో

వివాహిత మృతి

5

జాతీయ స్థాయికి ఎంపికవ్వాలి

- కలెక్టర్ బీఎం సంతోష్

5

లారీ ఢీకొని వ్యక్తి మృతి

జడ్చర్ల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల క్రాస్‌రోడ్డులో హైదరాబాద్ వైపు వెళ్లే దారిలో లారీ ఢీ కొన్ని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల కేంద్రానికి చెందిన శ్రీను దంపతులు జడ్చర్ల క్రాస్‌రోడ్డు వద్ద హైదరాబాద్ వైపు వెళ్లే దారిలో బస్సులు నిలిపే ప్రాంగణంలో నిలబడ్డారు. నిలబడిన శ్రీనును అదే దారిలో వచ్చిన లారీ ఢీ కొట్టగా తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం జడ్చర్ల జనరల్ ఆసుపత్రికి తరలించే లోపే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ సంఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని జడ్చర్ల పోలీసులు తెలిపారు.

అనుమానాస్పదంగా మరొకరు

మూసాపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి ఆకస్మికంగా మృతి చెందిన మండలంలోని జానంపేట గ్రామ శివారులో చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం. జానంపేట గ్రామానికి చెందిన హనీఫ్ (52) జీవనోపాధి కోసం కొనేళ్ల క్రితం జడ్చర్లకు వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. సొంత గ్రామమైన జానంపేట పెట్రోల్ బంకు సమీపంలోని నేరేడు చెరువు అలుగు కాల్వలో చేపల వేట కోసం వచ్చి కొంతమేరకు చేపలు పట్టుకుని అక్కడే వ్యవసాయ పొలంలో తలకింద వాటర్ బాటిల్ పెట్టుకుని నిద్రపోయి మృతి చెందాడు. ఆదివారం సాయంత్రం ఆటుగా గొర్రెల మేపుకు వెళ్లిన కాపరి పొలంలో మృతి చెందడాన్ని గమనించి పొలం యాజమాని బొక్క రాములుకు సమాచారం ఇవ్వగా.. గ్రామానికి చెందిన హనీఫ్‌గా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహన్ని జడ్చర్లకు తీసుకెళ్లారు. మృతుడి భార్య, నలుగురు కుమారులు ఉన్నారు. పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

రెండు బైకులు ఢీకొని ఇంకొకరు

భూత్పూర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ రూరల్ మండలం ఇప్పలపల్లి గ్రామానికి చెందిన శివరాజు గ్రామం నుంచి మహబూబ్‌నగర్‌కు బైక్‌పై వెళ్తున్నాడు. అదే దారిలో ఎదురుగా తాటికొండ గ్రామ పంచాయతీ పరిధిలోని నెహ్రూనగర్‌కు చెందిన యాదగిరి బైక్‌పై గాజులపేటకు వస్తున్నాడు. ఈ క్రమంలో తాటికొండ గ్రామానికి వెళ్లే టీ జంక్షన్ వద్ద రెండు బైకులు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇప్పలపల్లికి చెందిన శివరాజు (40) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య మంజులతో పాటు ఇద్దరు కూతుళ్ల ఉన్నారు. యాదగిరికి తీవ్రగాయాలు అయ్యాయి. ఎస్ఐ చంద్రశేఖర్ సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు.



సాయిమందిరంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లితండ్రులు

చిన్నారులకు అక్షరాభ్యాసం

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) :వసంత పంచమి సందర్భంగా పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలోని సాయి మందిరంలో ఆదివారం సరస్వతీ అమ్మవారికి విశేష పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు.



కల్యాణానికి హాజరైన భక్తులు



కల్యాణాన్ని జరిపిస్తున్న పండితులు

ఘనంగా చెన్నకేశవస్వామి తిరుకల్యాణం

జడ్చర్ల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మండలం గంగాపురంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామి వారి తిరుకల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహలను గ్రామంలో ఊరేగించారు. అనంతరం స్వామివారికి, అమ్మవారికి ఎదుర్కోలు నిర్వహించారు. తిరుకల్యాణంలో జడ్చర్లతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.

వీఐపీ కాటేజీలను ప్రారంభించిన ఎంపీ డీకే అరుణ

దేవాలయ ప్రాంగణంలో దాతలు అయ్యగారి యశోదమ్మ, రంగారెడ్డిల జ్ఞాపకార్థం వారి కుమారుడు అయ్యగారి విష్ణువర్ధన్‌రెడ్డి, లక్ష్మీ రూ.25 లక్షలతో నిర్మించిన వీఐపీ కాటేజీలను మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త గోకుల్, ఆలయ ఈవో దీప్తిరెడ్డి, ట్రస్టీ సభ్యులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సాహిత్య సంస్థ సేవలు అభినందనీయం



వాణీ శతకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

మహబూబ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): సాహిత్య రంగంలో తెలంగాణ మహిళా సాహిత్య, సాంస్కృతిక సంస్థ సేవలు అభినందనీయమని ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంటరెడ్డి అన్నారు. తెలంగాణ మహిళా సాహిత్య సాంస్కృతిక సంస్థ ఐదో వార్షికోత్సవ వేడుకలను ఆదివారం జిల్లా కేంద్రంలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్ భవన్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షురాలు రావూరి వనజ రచించిన వాణీ శతకం ఆవిష్కరణ వైభవంగా జరిగింది. ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి సభాధ్యక్షుడిగా వ్యవహరించారు. ఆయన మాట్లాడుతూ పిల్లల చేత రామాయణ, భారత భాగవతాలు చదివించాలన్నారు. నైతిక, మానవతా విలువలకు శతక ప్రక్రియ దోహద పడుతుందన్నారు. చక్కటి జ్ఞానాన్ని ప్రసాదించే సరస్వతి పుట్టిన రోజు వాణీ శతకం ఆవిష్కరించడం సంతోషకరమన్నారు. మహిళా సాహిత్య సాంస్కృతిక సంస్థ చేస్తున్న సాహిత్య కృషిని కొనియాడారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఆచార్య మనసన చెన్నప్ప మాట్లాడుతూ వేదాలు, శాస్త్రాలు, కావ్యాలు, వాణి కరుణ వల్లనే ఆవిర్భావిస్తాయన్నారు. వాణీ శతకము భక్తి ప్రవత్తులతో కూడుకొని ఉందన్నారు. జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళా సాహిత్య సాంస్కృతిక సంస్థ ఐదు సంవత్సరాల నుంచి చేస్తున్న సాహితీ సేవలను కొనియాడారు. చుక్కాయపల్లి శ్రీదేవి పుస్తక సమీక్ష చేశారు. డాక్టర్ పొద్దుటూరి ఎల్లారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో సాహిత్యాభిలాషను రేకెత్తించేలా సంస్థ చేస్తున్న కార్యక్రమాలను కొనియాడారు. కార్యక్రమాంలో గంటా మనోహర్‌రెడ్డి, డాక్టర్ నలవోలు నరసింహారెడ్డి, సంస్థ ప్రధాన కార్యదర్శి జి.శాంతారెడ్డి, టి.శ్రీలక్ష్మీ, పురుషోత్తంరెడ్డి, శివార్చక విజయకుమార్, రావూరి సూర్యనారాయణ, రావూరి కృష్ణ కుమార్, మేకల అనురాధ, సావిత్రి, ఖాజామైనోద్దిన్, గుముడాల చక్రవర్తిగౌడ్, బోల యాదయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

జడ్చర్ల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కోళ్లు తరలించే వాహనం, బైకు ఢీ కొన్న సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం జడ్చర్ల క్రాస్‌రోడ్డు నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే సబ్‌రోడ్డులో జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్ నుంచి జడ్చర్లకు కోళ్లను తరలించే వాహనం వస్తుండగా రాంగ్‌రూట్‌లో వచ్చిన బైకు ఢీ కొట్టింది. ఈ సంఘటనలో బైకుపై ఉన్న నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం ఆవంచ గ్రామానికి చెందిన రాములు (45) తీవ్రగాయాలయ్యాయి. రాములును చికిత్స కోసం జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రి, అనంతరం జిల్లా జనరల్ ఆసుపత్రికి అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

పది విద్యార్థులకు అల్పాహారం

నారాయణపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ప్రత్యేక తరగతులకు హాజరవు తున్న విద్యార్థులకు ప్రభుత్వం అరు రకాల అల్పాహారం అందించేందుకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ఈ నెల ఒకటవ తేదీ నుంచి మార్చి 20వ తేదీ వరకు అందించేందుకు ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.15 ఖర్చు చేస్తుంది. జిల్లా వ్యాప్తంగా పల్లి, బెల్లం చెక్కి, బిస్కెట్స్, బొబ్బర్లు, పకోడ, శనిగలు అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 95 ఉన్నత పాఠశాలలు, 11 కస్తూర్బాలు, రెండు మాడల్ స్కూల్స్, పది గురుకులాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 6,164 మంది విద్యార్థులు చదువుతున్నారు.



ముడుమాల్ జడ్పీహెచ్ఎస్‌లో అల్పాహారంతో విద్యార్థినులు

కోరిన కోర్కేలు తీర్చే జములమ్మ తల్లి



జమ్ములమ్మ అమ్మవారు

గద్వాల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నడిగడ్డలో భక్తుల కొంగుబంగారంగా పిలువబడి.. మూడు రాష్ట్రాల భక్తుల పూజలందుకుంటూ కోరిన కోరికలను తీర్చుతున్న జమ్ములమ్మ దేవత బ్రహ్మోత్సవాలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. పుట్టినిల్లు అయిన దీవి గ్రామం గుర్రం గడ్డ నుంచి అమ్మవారిని తీసుకురావడానికి మంగళవారం ఎద్దుల బండి పోతుంది. అక్కడ ఆ రాత్రి పూజల అనంతరం తెల్లవారు జామున ఎద్దుల బండిపై అమ్మవారిని మెట్టినిల్లు అయిన జమ్ములమ్మ దేవస్థానానికి తీసుకువస్తారు. మాఘ శుద్ధపౌర్ణమి రోజు అనగా 12వ తేదీ ఆదివారం పౌర్ణమిని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రతీ మంగళ, శుక్రవారాలలో అమ్మవారిని దర్శించుకోవడానికి భారీ సంఖ్యలో వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.

మాఘ శుద్ధ పౌర్ణమికి..

ప్రతీ ఏడాది మాఘశుద్ధ పౌర్ణమి ముందు మంగళవారం రోజున అమ్మవారిని సాంప్రదాయ పద్ధతిలో పెట్టినిల్లు అయిన గుర్రంగడ్డ గ్రామం నుంచి తీసుకువస్తారు. ఇందుకోసం ఎద్దుల బండిని సిద్ధం చేశారు. మరుసటి రోజు మెట్టినింటికి తీసుకవచ్చి పూజలు నిర్వహిస్తారు. మాఘశుద్ధ పౌర్ణమి రోజు అనగా బుధవారం నుంచి ప్రతీ మంగళ, శుక్రవారాలలో ఆరునెలల పాటు వేల సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుంటారు. అదే పౌర్ణమిరోజు గద్వాలలో స్వయంభూ లక్ష్మీచెన్న కేశవస్వామి రథోత్సవం కూడా నిర్వహిస్తారు.

బ్రహ్మోత్సవాలకు పూర్తైన ఏర్పాట్లు

బ్రహ్మోత్సవాలలో అమ్మవారిని దర్శించుకోవడానికి దాదాపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యుద్దీపాలంకరణలో అమ్మవారి ఆలయం వెలిగిపోతుంది. భక్తుల కోసం 30 గదులను అందుబాటులో ఉంచారు. షామియాన వేసుకునే వారికి పరిసరప్రాంతాలతో ప్రభుత్వం ఇచ్చిన ఐదు ఎకరాల స్థలాన్ని చదును చేసి ఉంచినట్లు ఆలయ చైర్మన్ వెంకట్రాములు, ఈవో పురేందర్ కుమార్‌లు తెలిపారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించేందుకు 35సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ టంగుటూరు శ్రీను తెలిపారు. భక్తుల ప్రయాణ సౌకర్యం కోసం ఆర్టీసీ వారు జమ్ములమ్మ స్టేజి వరకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ డీఎం తెలిపారు.

అంగరంగవైభవంగా నిర్వహిస్తాం



అమ్మవారి బ్రహ్మోత్సవాలను అంగరంగవైభవంగా నిర్వహిస్తాం. అమ్మవారికి స్వాగతం పలికేందుకు హైదరాబాద్, ఇతర ప్రాంతాల నుంచి కళాకారులు, పుట్టబొమ్మలు, పోతురాజులు, శివసత్తులు, డప్పువాయిద్య కళాకారులను పిలిపించాం. వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

- వెంకట్రాములు, ఆలయ చైర్మన్, జములమ్మ ఆలయం

వివాదాస్పదంగా మారిన బైపాస్

- కల్వకుర్తి, నంద్యాల జాతీయ రహదారి బైపాస్ రోడ్డుకు భూములు ఇవ్వబోమని రైతుల ఆందోళన



శనివారం బైపాస్ రోడ్డు కోసం సర్వే చేస్తున్న అధికారులు

తాడూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన కల్వకుర్తి నంద్యాల 167కే జాతీయ రహదారికి సంబంధించి కొంతకాలంగా భూనిర్వాసితులు ఆందోళన చేస్తున్నారు. ప్రధానంగా బైపాస్ రోడ్డుకు సంబంధించి గతంలో మూడు అలైన్‌మెంట్లకు ప్రభుత్వం సర్వే చేసింది. మూడు సర్వేలకు సంబంధించి వెంకటాపూర్ గేటు నుంచి వెళ్లే రహదారికి సంబంధించి రెండు కిలో మీటర్లన్నర రోడ్డు అలైన్‌మెంట్‌ను ఫైనల్ చేశారు.

అలైన్‌మెంట్ ఫైనల్ చేసినప్పటి నుంచి ఉన్న కొద్ది భూమిని కోల్పోతున్న రైతులు కొంతమంది ఆందోళనలు చేస్తూ అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. అయినప్పటికీ సర్వే పనులు ఎక్కడ ఆగలేదు. ఈ తరుణంలో రెండున్నర కిలోమీటర్ల పరిధిలో సుమారు 60 ఎకరాల భూములు పోతుండగా వీటిలో 800 మీటర్లకు సంబంధించి నిరుపేదలైన 25మంది రైతులు ఆందోళన చేస్తున్నారు. ప్రధానంగా ఇందులో పదెకరాలకు సంబంధించి సర్వే నెంబరు 68లో ఒక రైతు, 72లో 10మంది, 120లో ముగ్గురు, 126 సర్వే నెంబరులో ఎనిమిది మంది, 134 సర్వే నెంబరులో ఇద్దరు రైతులు నిరసన తెలుపుతున్నారు. ప్రభుత్వం భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం ఎంత ఇస్తామనే విషయాన్ని చెప్పకుండా సర్వే చేస్తూ జాతీయ రహదారి అంటూ హద్దులు ఏర్పాటు చేస్తున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇందులో భాగంగానే గత కొన్ని రోజులుగా రహదారి, రెవెన్యూ, పోలీస్ అధికారుల మధ్య రైతులతో నిత్యం వివాదాలు జరుగుతున్నాయి. శనివారం పోలీసులు బందోబస్తు మధ్య భూములు సర్వే చేస్తుండడంతో ఇద్దరు రైతులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వారిని ఆస్పత్రికి తరలించి పోలీసులు, రెవెన్యూ అధికారులు సర్వే పనులను పూర్తి చేసి జాతీయ రహదారికి సంబంధించి హద్దులను ఏర్పాటు చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి జాతీయ రహదారిలో భూములు కోల్పోతున్న వారికి భారీగా నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

పరిహారం ఇవ్వకుండా భూమి లాక్కోవడం సరికాదు



జాతీయ రహదారికి సంబంధించి భూములు కోల్పోతున్న రైతులకు నష్ట పరిహారం అందించకుండా హద్దులు ఏర్పాటు చేయడం ఎంత వరకు సమంజసం. ప్రస్తుతం ఉన్న అలైన్‌మెంట్లను మార్చాల్సిందే. ప్రభుత్వ కార్యకలాపాలకు జాతీయ రహదారులకు పేద, దళితుల భూములే తీసుకోవడం సరికాదు. అధికారులు స్పందించి నిర్వాసిత రైతులకు నష్ట పరిహారం పెద్ద ఎత్తున వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

- చింత సత్తి, తాడూరు బైపాస్ రోడ్డు భూనిర్వాసితుడు



ధన్వంతరి వేంకటేశ్వరస్వామి కల్యాణం జరుపుతున్న అర్చకులు

భక్తి శ్రద్ధలతో ధన్వంతరి వేంకటేశ్వరస్వామి కల్యాణం

అయిజ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఉత్తనూర్ ధన్వంతరి వేంకటేశ్వస్వామి కల్యాణం ఆదివారం భక్తి శ్రద్దలతో జరిపించారు. ఈ నెల 1వ తేదీ నుంచి ధన్వంతరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అయ్యాయి. అందులో భాగంగా ఆదివారం తెల్లవారుజామున 12-15 నిమిషాల ప్రాంతంలో కల్యాణం జరిపించారు. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామిల కల్యాణం కమనీయంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో కల్యాణానికి హాజరయ్యారు. చిన్నారుల కూచిపూడి నృత్యం అందరిని అలరించింది. కుమారి దివ్య బృందం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. చిన్నారులు కోలాటాలు ఆడుతూ చేసిన నృత్యాలు సైతం అలరించారు.



ఆలయం వద్ద కోలాటం ఆడుతున్న చిన్నారులు

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

రాజోలి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి మండలంలోని తూర్పు గార్లపాడులో వెలసిన ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఆదివారం ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠాపనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయం వద్ద చిన్నారుల కోలాటాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించిన దృశ్యం



సినిమాకు డబ్బులు ఇవ్వలేదని
బాలుడి ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ క్రైం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సినిమాకు డబ్బులు ఇవ్వలేదని ఓ బాలుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగింది. ఎస్ఐ గోవర్ధన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని సంతబజార్‌లో నివాసముంటున్న జలగరి గణేశ్, భారతి దంపతులకు కుమార్తె సంధ్య, కుమారుడు కార్తీక్ ఉన్నారు. ఆదివారం మధ్యాహ్నం సినిమాకు వెళ్తానంటూ కార్తీక్ (13) తండ్రిని డబ్బు అడిగాడు. తాము గుడికి వెళ్తున్నామని, ఇంట్లో ఉండాలని, వచ్చాక డబ్బులు ఇస్తామని చెప్పి, కుమార్తె సంధ్యను తీసుకొని వెళ్లారు. తిరిగి వచ్చే సరికి గది తలుపు దగ్గర వేసి ఉంది. లోనికి వెళ్లి చూడగా, అప్పటికే కార్తీక్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొని ఉన్నాడు. సంఘటనపై తండ్రి జలగరి గణేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన



వనపర్తిలో మాట్లాడుతున్న పుట్ట ఆంజనేయులు

వనపర్తి రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : బడ్జెట్‌లో కోత విధించడం గిరిజనులను మోసం చేయడమే అని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పుట్ట ఆంజనేయులు అన్నారు. ఆదివారం వనపర్తి పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సీపీఎం వనపర్తి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బడ్జెట్‌కు నిరసనగా నిరసన కార్యక్రమం చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు లక్ష్మీ, రాజు, ఉమాదేవి, సీపీఎం వనపర్తి పట్టణ నాయకులు కురుమయ్య, గంధం మధన్, గట్టయ్య, బాలస్వామి, రాబర్ట్, మన్యం, త్యాగయ్య, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

అమరచింత : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందని ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం మాట్లాడారు. బడ్జెట్‌లో తెలంగాణకు అన్ని రంగాల్లో అన్యాయం జరిగిందని విమర్శించారు. మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణతో పాటు మిగతా బీజేపీ ఎంపీలు ఉన్నప్పటికీ ఈ ప్రాంతానికి బడ్జెట్‌లో పూర్తి స్థాయిగా అన్యాయం జరిగిందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జీఎస్ గోపి, ఆర్ఎన్ రమేష్, వెంకటేష్, అజయ్, శ్యాంసుందర్, బుచ్చన్న, రవి, రాఘవేంద్ర, తిరుపతి, షేక్‌పాషా, వెంకటేష్, మల్లేష్, రవి, ప్రకాష్, వినోద్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంజన్న బ్రహ్మోత్సవాలు

- కనుల పండువగా పల్లకీసేవ, తెప్పోత్సవం

ధరూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ధరూరు మండలపరిధిలోని పెద్దచింతరేవుల గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి బ్రహోత్సవాలు రెండో రోజు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం అర్చకులు స్వామివారికి పల్లకీసేవ, ప్రభోత్సవంతో పాటు తెప్పోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం బాజాభజంత్రీలు, మేళతాళాలు, స్వామివారి నామాల నుస్మరిస్తూ స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఆలయం నుంచి గ్రామంలోని వీధుల్లో ఊరేగింపుగా తీసుకువెళ్లారు. స్వామివారి పల్లకీసేవా కార్యక్రమంలో వ్యవస్థాపక వంశీయులు గిరిరావు, కార్యనిర్వాహణాధికారి కవిత, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు మాఘ శుద్ధ వసంత పంచమి సోమవారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు రాత్రి 10 గంటలకు రథోత్సవం నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుకుండా బందోబస్తుతో ఏర్పాటు చేశారు.

ఇందిరమ్మ లబ్ధిదారుల్లో నైరాశ్యం

» మంజూరు పత్రాలు వెనక్కి తీసుకున్న అధికారులు

వెల్దండ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పథకం అబాసుపాలవుతున్నది. ఇళ్ల నిర్మాణాలతో ఇక తమ సమస్యలు తీరుతాయని భావించిన నిరుపేదలకు మంజూరైన పత్రాలు ఇచ్చినట్టే ఇచ్చి అధికారులు వాపసు తీసుకున్న సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని చెర్కూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఇచ్చిన పత్రాలపై కలెక్టర్ సంతకం లేదని, సంతకాలు అయిన తర్వాత మళ్లీ ఇస్తామని లబ్ధిదారులకు చెప్పినా అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తున్నది. ప్రజాపాలనలో భాగంగా పథకాల అమలుకు మండలంలోని చెర్కూర్ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు ద్వారా ఎంపిక చేశారు. గణతంత్ర దినోత్సవం రోజున మండల అధికారులు గ్రామానికి చెందిన 98 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. ఇక తమ సమస్యలు తీరుతాయని, తమ ఇంటి కల నెరవేరనుందని ఆనందపడ్డారు. ఈ మేరకు గత నాలుగు రోజుల క్రితం గృహ నిర్మాణ శాఖ జిల్లా అధికారి సైతం గ్రామంలో పర్యటించి క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల స్థితిగతులను పరిశీలించారు. కానీ మంజూరు పత్రాలు పొందిన లబ్ధిదారుల ఆనందం ఎంతో కాలం నిలవలేదు. ఇచ్చిన మంజూరు పత్రాలపై కలెక్టర్ సంతకం లేదని, తిరిగి సంతకాలు చేయించి పత్రాలు అందిస్తామని అధికారులు పత్రాలను వాపసు తీసుకున్నారు. ఇచ్చిన పత్రాలు తిరిగి ఇస్తారోలేదోనన్న ఆందోళన లబ్ధిదారుల్లో చోటుచేసుకుంది. ఈ విషయంపై ఎంపీడీవో సత్యపాల్‌రెడ్డిని వివరణ కోరగా సంతకాలు లేకుండా పత్రాలు ఇచ్చామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పత్రాలు వాపసు తీసుకున్నామని తెలిపారు. పత్రాలపై సంతకాలు చేయించిన అనంతరం తిరిగి ఇస్తామని పేర్కొన్నారు. అర్హులైన వారిని గుర్తించి మంజూరు పత్రాలు అందజేస్తామని అన్నారు. కాగా తమకు వస్తాయోరావోనన్న ఆందోళన స్థానికుల్లో నెలకొంది. సంతకాలు లేకుండా మంజూరు పత్రాలు ఇవ్వడమేమిటని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. కాగా చెర్కూర్‌లో అందజేసిన పత్రాల మాదిరిగానే జిల్లాలో వివిధ గ్రామాల్లో పత్రాలు పోలి ఉండటం, అక్కడ వాపసు తీసుకోకుండా ఇక్కడ తీసుకోవడమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఏదిఏమైనా నిజమైన లబ్ధిదారులను గుర్తించి వారికి ధ్రువీకరణ పత్రాలు పారదర్శకంగా అందించాల్సి ఉంది.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ మహిళ మృతి



చిట్టి(ఫైల్)

తాడూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని పర్వతాయిపల్లి గ్రామానికి చెందిన చిట్టి(40) హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. వివరాల ప్రకారం.. పర్వతాయిపల్లి గ్రామానికి చెందిన అంజి, చిట్టెమ్మ దంపతుల మధ్య కొంత కుటుంబ కలహాల నేపథ్యంలో గత నెల 28వ తేదీన పురుగుల మందు తాగింది. దీంతో గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను హుటాహుటిన నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. గత ఐదారు రోజులుగా చికిత్స పొందుతూ మృతి చెందింది. దీంతో మృతురాలి భర్త అంజి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మురుగు కాల్వలో పడి వ్యక్తి..

మక్తల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మురుగుకాల్వలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని కేశవనగర్‌లో ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు సంఘటన వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన బండారి వెంకటేష్(46) పురపాలిక కార్మికుడిగా పనిచేసేవాడు. ఆరోగ్య సమస్యలతో విధుల్లోకి వెళ్లకపోవడంతో గత కొంత కాలంగా భార్య సుజాత పురపాలిక కార్మికురాలిగా పని చేస్తుంది. ఈ క్రమంలో వెంకటేష్ తాగుడుకు బానిసయ్యాడు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఆదివారం తెల్లవారుజామున బటయకు వచ్చి రోడ్డుపై వెళుతుండగా ప్రమాదశవాత్తు కాలుజారి డ్రైనేజీలో పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన కుటుంబ సభ్యులు అక్కడకు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భాగ్యలక్ష్మిరెడ్డి తెలిపారు.

బైక్‌పై నుంచి పడి యువకుడు..

కోస్గి రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ బాలరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండలం కమలుద్దీన్‌పూర్ గ్రామానికి చెందిన శివ తన స్నేహితుడు హన్వాడ మండలంలోని మునిమోక్షం గ్రామానికి చెందిన కేశవులు ఇద్దరు కలిసి బైక్‌పై సంపల్లి నుంచి నాచారం గ్రామానికి సొంత పనుల నిమిత్తం వెళుతున్న క్రమంలో కోస్గి శివారులో గల నాగసాన్‌పల్లి చౌరస్తా, ఇండియన్ పెట్రోల్‌బంక్ సమీపంలో గుర్తు తెలియని ఆటో వెనుకాల నుంచి ఓవర్ టేక్ చేస్తుండగా బైక్ అతివేగంగా ఉండటంతో అజాగ్రత్తగా సడన్ బ్రేక్ వేయడంతో బైక్ వెనకాల ఉన్న శివ ప్రమాదవశాత్తు కింద పడ్డాడు.

దీంతో శివ తలకు తీవ్ర రక్త గాయాలు కావడంతో అంబులెన్స్‌లో కోస్గి ఆసుపత్రికి తరలించారు. తలకు బలమైన రక్త గాయాలు కావడంతో శివ మరణించినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మృతుని తండ్రి కుర్వ భీరయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో వివాహిత..

మూసాపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం కాటవరం గ్రామానికి చెందిన ఓ వివాహిత విద్యుత్తు షాక్‌కు గురై మృతి చెందింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. కాటవరం గ్రామానికి చెందిన గొల్ల శిరీష(35) తన భర్త రాజు కుటుంబ సభ్యులతో కలిసి గత కొంత కాలం నుంచి జీవనోపాధి కోసం హైదరాబాద్‌లోని షామీర్‌పేటలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. అద్దె ఇంట్లోని మూడో అంతస్థులో నివాసం ఉండే వీరి పిల్లలు శనివారం సాయంత్రం ఆటలు ఆడుతుండగా చెప్పులు విద్యుత్తు తీగలపై పడటంతో గొల్ల శిరీష వాటిని తీసే క్రమంలో ప్రమాదానికి గురై అపస్మారక స్థితికి చేరుకుని మృతి చెందింది. దీంతో ఆదివారం మృతదేహాన్ని కాటవరం గ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

బాలికతో అసభ్య ప్రవర్తన

అచ్చంపేటటౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండల పరిధిలోని ఓ తండాకు చెందిన బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడని యువకునిపై కేసు నమోదు చేశామని ఎస్సై రమేశ్ తెలిపారు. ఆదివారం ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన బాలిక తన వరుసకు బాబాయ్ అయిన యువకుడు ఇటీవల అసభ్యంగా ప్రవర్తించాడని అట్టి విషయాన్ని తల్లిదండ్రులకు ఆమె వివరించింది. ఆదివారం తల్లిదండ్రులు అచ్చంపేట పోలీసుస్టేషన్‌లో సదురు వ్యక్తిపై ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నేటి నుంచి జోగుళాంబ అమ్మవారి వార్షికోత్సవాలు

అలంపూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ఏకైక శక్తి పీఠంగా విరాజిల్లుతున్న జోగుళాంబ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు సంవత్సరానికి ఒకసారి జరుగుతాయి. అందులో భాగంగానే సోమవారం వసంత పంచమిని పురస్కరించుకొని అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ముందుగా ఉదయం 9 గంటల నుంచి అమ్మవారి ఆలయ యాగశాల నందు నిత్య హోమాలు, మహా పూర్ణాహుతి, కలశ ఉద్వాసన, సహస్ర ఘట్టములకు ఆవాహన అర్చన అనంతరం జోగుళాంబ అమ్మ వారికి (మూలమూర్తికి) అవబృత స్నపనం, పంచామృతాభిషేకం నిర్వహించి అమ్మవారి నిజరూప దర్శనం భక్తులకు కల్పిస్తారు. సాయంత్రం 4 గంటలకు జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి వార్ల శాంతి కల్యాణోత్సవం, 6 గంటలకు ధ్వజ అవరోహణంతో బ్రహ్మోత్సవాలు సమాప్తం అవుతాయి. వచ్చే భక్తులకు ఎటువంటి ఆటంకాలు, ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు వహించాలని ఆలయ సిబ్బందిని ఈవో పురేందర్ కుమార్ సూచించారు.

భలాన్‌పల్లిలో సూర్యకాంతులు

● నేటి నుంచి సూర్యనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు

» రాష్ట్రంలోనే భలాన్‌పల్లిలో ఉన్న ఏకైక సూర్యనారాయణస్వామి దేవాలయం

» ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ సభ్యులు



తాడూరు మండలంలోని భలాన్‌పల్లి గ్రామంలో ఉన్న సూర్యనారాయణస్వామి పురాతన దేవాలయం



సూర్యభగవానుడి మూల విరాట్

తాడూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ఏకైక సూర్యనారాయణస్వామి దేవాలయం నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని భలాన్‌పల్లి గ్రామంలో ఉంది. ఈ ఆలయాన్ని 400 సంవత్సరాల క్రితం కాకతీయుల కాలంలో నిర్మించారు. కాలక్రమేణా తదనంతరం ముస్లిం రాజుల పరిపాలనలో ఆలయం ధ్వంసమైనట్లు గ్రామస్థులు తెలుపుతున్నారు. అయితే అతి పురాతన ఆలయం కావడం మూలంగా 2020లో గ్రామస్థులందరూ కలిసి ఆలయాన్ని పునర్ని ర్మించాలని నిర్ణయించారు. ప్రతీ రథసప్తమిని పురస్క రించుకుని సూర్యభగవా నుడికి బ్రహ్మోత్సవాలను వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు.

అయితే, ఈనెల 4వ తేదీన రథసప్తమి నాడు సూర్యాస్తమయం సందర్భంగా సూర్యభగవానుడి విగ్రహంపై కిరణాలు పడటం ప్రత్యేకం.

● బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు

సూర్యభగవానుడి బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఆలయం నందు గ్రామస్థుల అందరి సహాయ సహకారాలతో నూతన ఆలయ కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఇప్పటికే ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబు కాగా బ్రహ్మోత్సవాల్లో తీసుకోవాల్సిన అన్ని పనులకు సంబంధించి కూలంకషంగా చర్చించుకున్నారు. సూర్యభగవానుడి ఆలయం దర్శనానికి సంబంధించి నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం నుంచి 25కిలో మీటర్లు కాగా జడ్చర్ల నుంచి 30కిలో మీటర్లు, కల్వకుర్తి నుంచి 30కిలో మీటర్ల దూరంలో ఈ ఆలయం ఉన్నది. సూర్యభగవానుడి ఆలయం ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా అరసవెల్లిలో ఉండగా ప్రస్తుతం తెలంగాణలోని భలాన్‌పల్లి గ్రామంలో ఉంది.

● బ్రహ్మోత్సవాల వివరాలు

సూర్యభగవానుడి రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని జరిగే బ్రహ్మోత్సవాల వివరాలు ఇలా.. 3వ తేదీ సోమవారం ఉదయం 6గంటలకు సూర్యనారాయణ స్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు చేసి స్వామి వారికి అభి షేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులచే సూర్యఆదిత్య పారాయణం, భగవద్గీత, ప్రథమ శతకం పారాయణం, మలయాళ స్వామి చేతుల మీదుగా విశ్వశాంతి మహాయజ్ఞం నిర్వహించగా 4వ తేదీ మంగళవారం సూర్య నారాయణస్వామి ఆదిత్య హృదయా పారాయణం, ఛాయాదేవి, ఉషాదేవి సమేత సూర్యభగవా నుడి కల్యాణోత్సవం మధ్యాహ్నం 11గంటలకు నిర్వహించనున్నారు. సాయంత్రం 4గంటలకు ఆలయ ప్రాంగణం చుట్టూ బండ్ల ఊరేగింపు చేయనున్నారు. 5వతేదీ బుధవారం ఉదయం 8గంటలకు స్వామి వారికి అభిషేకం, పూజలు పూర్తైన అనంతరం సత్యనారాయణస్వామి సామూహిక వ్రతాలను నిర్వహించడం జరుగుతుంది.

ఈ బ్రహ్మోత్సవాలకు ముఖ్య అతిథులుగా స్థానిక శాసనసభ్యులు కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిలు హాజరవనున్నట్లు తెలిపారు. ఈ మూడు రోజుల బ్రహ్మోత్సవాల సమయంలో ప్రతిరోజు మధ్యాహ్నం దాతల సహకారంచే అన్నప్రసాదాలను అందజేయడంతో పా టు సూర్యనారాయణస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భజన పోటీలను సైతం ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి 20వేలు, రెండవ బహుమతి 15వేలు, మూడవ బహుమతి 10 వేలు, నాల్గవ బహుమతి 6వేలు, 5వ బహుమతి 4వేలు, 6వ బహుమతి 2వేలు ఇవ్వనున్నట్లు మరో ఐదు భజనమండలిలకు ప్రోత్సాహక బహుమతిగా 516రూపాయలు ఇవ్వడం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

బ్రహ్మోత్సవాల్లో జరిగే అన్ని కార్యక్రమాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలోనే నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

భక్తుల ఇలవేల్పు

● స్వయంభూ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

» నేడు కల్యాణోత్సవం .. రేపు రథోత్సవం

» ఏడు నుంచి 16వ తేదీ వరకు జాతర



అమడబాకుల గ్రామంలోని స్వయంభూ వేంకటేశ్వరస్వామి దేవాలయం



వేంకటేశ్వరస్వామి మూలవిరాట్

కొత్తకోట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని అమడబాకుల గ్రామంలోని స్వయం భూ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నేత్ర పర్వంగా ప్రారంభమయ్యాయి. ఈ ప్రాంత భక్తుల ఇలవేల్పుగా ఖ్యాతి పొందిన స్వయంభూ వేంకటేశ్వరస్వామి రాజుల కాలంలో నిర్మించబడిన దేవాలయం. ఇప్పటికీ ఈ దేవాలయం గ్రూప్ ఆఫ్ టెంపుల్ (వనపర్తి రాజవంశస్థులు) ఆధ్వర్యంలో కొనసాగుతోంది. ప్రతీ ఏడాది మాఘమాసం తదియ సందర్భంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం అయి నవమితో ముగిస్తాయి. ఆ మరుసాటి రోజు నుంచి పదిహేను రోజుల పాటు జాతర జరుగును.

ఇక్కడి జాతర మాత్రం ప్రజలతో పక్షం రోజులు కళకళలాడుతుంది.

ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు ..

స్వయంభూ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మాఘమాసం తదియను పురస్కరించుకొని శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. చవితి రోజు ధ్వజారోహణ పూజల్లో భక్తులు పాల్గొన్నారు. ఆలయ వేద పండితులు వేదమంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రికి భేరి పూజలు, దేవతాహ్వాన కార్యక్రమం అనంతరం పూజల్లో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

దివ్య జ్యోతిగా వెలుగుతోన్న ఆఖండజ్యోతి

స్వయంభూ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని అఖండ జ్యోతి దివ్యజ్యోతిగా వెలుగుతోంది. ఆలయ పునర్ధురణ సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజలు చేపట్టారు ఆ సమయంలో గాలి వానలతో ఈ ప్రాంతం బీభత్సవానికి గురైంది. భక్తులు, వేదపండితులు బతుకు జీవుడా అంటూ తలోదిక్కు వెళ్లారు. కానీ పూజల కోసం ఏర్పాటు చేసిన కుటీరం కూలిపోయినా అందులో ఓ మూలన ఉన్న దీపం మాత్రం వెలుగుతూ ఉండింది.

అదే ఆ గ్రామ ప్రజలకు విశ్వాసం పెంచింది. అప్పటి నుంచి పెద్దలు ఆలయ చరిత్ర చెపుతున్నట్లుగా తిరుపతి వేంకటేశ్వరస్వామి ఇక్కడ దర్శనం ఇస్తున్నారని భక్తుల నమ్మకం.

కనుల పండువగా కల్యాణోత్సవం

మాఘమాసం పంచమి పురస్కరించుకొని స్వయంభూ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం కమనీయంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అమడబాకుల గ్రామ ప్రజలతో పాటు చుట్టు పక్కల గ్రామాలైన సత్యహళ్లి, బూత్కూర్, ముమ్మళపల్లి, రాయనిపేట, సంకిరెడ్డిపల్లి, కొత్తకోట గ్రామాలకు చెందిన భక్తులు కల్యాణోత్సవం తిలకించడానికి హాజరవుతారు. కల్యాణోత్సవానికి ముందు హోమం, బలిహరణ అనంతరం ప్రభోత్సవం, డోలోత్సవ కార్యక్రమంలో నిర్వహిస్తారు. సప్తమి రోజున పూలతో అలంకరించిన రథోత్సవం (తేరు) ఉత్సవం నిర్వహించనున్నారు. ఈ రథో త్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేంకటేశ్వరస్వామి నామసర్మణ చేస్తూ తేరు లాడగం జరుగుతుంది. నవమితో నాగవెల్లి పూజలతో బ్రహ్మోత్సవాలు ముగించడబుతాయి.

కల్యాణోత్సవానికి ముస్తాబైన ఆలయం..

ఏడాదికి ఒక్కసారి స్వయంభూ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించడానికి ఆలయ అభివృద్ధి కమిటీ ఏర్పాట్లు చేపట్టింది. దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

కల్యాణం తిలకించడానికి వచ్చే భక్తుల కోసం షామియానాలు, కుర్చీలు ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. కల్యాణం అనంతరం అన్నదానం కొనసాగుతుంది.

గల్లంతైన బాలుడి మృతదేహం లభ్యం



రాస్తారోకో చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్థులు

జడ్చర్ల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని ఉదండాపూర్ సమీపంలో నిర్మాణంలో ఉన్న ఉదండాపూర్ ప్రాజెక్టులోని నీళ్ల నిలిచిన గుంతలో పడి గల్లంతయిన బాలుడి మృతదేహం ఆదివారం లభ్యమయ్యింది. ఉదండాపూర్ గ్రామానికి చెందిన ఆరేళ్ల మల్లయ్య, పార్వతమ్మల కుమార్తె భాగ్యలక్ష్మి(6), కుమారుడు మహేష్(4)లు శనివారం ప్రమాదవశాత్తు నీళ్ల నిలిచిన గుంతలో పడ్డారు. ఈ సంఘటనలో భాగ్యలక్ష్మి మృతదేహం లభించగా, మహేష్ గల్లంతయ్యాడు. మహేష్ మృతదేహం ఆదివారం ఉదయం నీటి గుంతలో లభ్యమయ్యింది.

ఒకే కుటుంబానికి చెందిన అక్క, తమ్ముడు ఇద్దరు నీళ్ల నిలిచిన గుంతలో పడి మృతి చెందడంతో ఉదండాపూర్ గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. నీళ్ల గుంతలో పడిన భాగ్యలక్ష్మి, మహేష్‌లను వెదికేందుకు సంఘటన స్థలంలో జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి, ఎస్‌ఐలు చంద్రమోహన్, శివానందం, జడ్చర్ల ఫైర్‌మెన్ లక్ష్మీకాంత్‌రెడ్డిల బృందం గాలింపు చర్యలు చేపట్టారు. మృతి చెందిన భాగ్యలక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉదయం జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాలింపు చర్యలు చేపట్టిన అనంతరం లభ్యమయిన బాలుడు మహేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలిస్తుండగా గ్రామస్థులు అడ్డుకుని ధర్నా చేపట్టారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలంటూ రాస్తారోకో

ఉదండాపూర్ ప్రాజెక్టు నిర్మాణంలోని నీళ్ల నిలిచిన గుంతలో పడి ఒకే కుటుంబంలో ఇద్దరు చిన్నారులు మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలంటూ బాధిత కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్థులు దాదాపు గంట పాటు రాస్తారోకో నిర్వహించారు. ఆందోళన నిర్వహించిన వారి వద్దకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రాజెక్టు పనులు నిర్వహిస్తున్న కంపెనీల ప్రతినిధులు చేరుకుని బాధిత కుటుంబానికి పరిహారం అందించనున్నట్లు వెల్లడించారు. బాధిత కుటుంబానికి రూ.10లక్షల ఆర్థిక సహాయం అందించనున్నట్లు ప్రకటించి, సంఘటన స్థలంలో రూ. 50వేల ఆర్థిక సహాయాన్ని అందచేశారు.

దీంతో బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ధర్నా విరమించారు. ఇద్దరు చిన్నారులను కోల్పోయిన కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామంటూ ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి వెల్లడించారు.

కల్యాణం.. కమనీయం

» వైభవంగా పాలెం వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



పాలెం వెంకన్న స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు

బిజినేపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా కమనీయంగా కొనసాగింది. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని పాలెం వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయం ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో ఆదివారం స్వామి కల్యాణం వేదపండితుల వేద మంత్రోచ్చారణలతో ఘనంగా నిర్వహించారు. ముందుగా దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో కల్యాణ మండపానికి తీసుకెళ్లి పట్టు వస్త్రాలు, ఆభరణాలతో అందంగా అలంకరించారు. అమ్మవారికి, స్వామివార్లకు జీలకర్ర బెల్లం పెట్టించిన అనంతరం మాంగల్యధారణ భక్తుల హర్షధ్వనుల మధ్య కనుల పండువగా కల్యాణఘట్టం, తలంబ్రాలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి స్వామి వారి కల్యాణోత్సవానికి హాజరైన భక్తులకు ఆలయ మాజీ చైర్మన్ జున్నా శేఖర్ రెడ్డి అన్నదానం చేపట్టారు. అనంతరం స్వామి కల్యాణోత్సవానికి సహకరించిన దంపతులను ఘనంగా సన్మానించి వేదపండితులు ఆశీర్వదించారు.

కల్యాణోత్సవంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మనుసాని విష్ణుమూర్తి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్ సుమలత దంపతులు, మాజీ సర్పంచ్ గోవిందు లావణ్య, నాగరాజు దంపతులు, ఉపసర్పంచ్ చికొండ్ర రాములు, చంద్రకళ దంపతులు, ఈవో చిలుకూరు రంగారావు, శ్రీనివాస్ గుప్తా, అర్చకులు కొరవి రామానుజాచార్యులు, జయంత్, చక్రపాణి, ఆలయ కమిటీ మాజీ సభ్యులు గాడి సురేందర్, గంధం వెంకటేశ్వర్లు, సొప్పరి బాలస్వామి, వలంటీర్లు కొంకల మధు, శివకుమార్, జగదీష్, వెంకటే ష్, వెంకటరమణ, దయానంద్, గోపాలస్వామి ఉన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో రాణించాలి

» మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ



మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మార్షల్ ఆర్ట్స్‌లో రాణించాలని మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ అన్నారు. ఆర్కే స్పోర్ట్స్ కరాటే దూ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి ఎంపీ-2025 కరాటే పోటీలు నిర్వహించారు. పోటీలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు జిల్లా కేంద్రంలో నిర్వహించడం పట్ల నిర్వాహకులను అభినందించారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, కరాటేలో జాతీయ, అంతర్జాతీయ పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ప్రస్తుత సమాజంలో ప్రతీ ఒక్కరూ కరాటే నేర్చుకోవాలని సూచించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పాండురంగారెడ్డి, పద్మారెడ్డి, సీనియర్ మాస్టర్ రవీందర్, అకాడమీ ఫౌండర్ రవికుమార్, అడ్వైజర్ విజయ్‌కుమార్, మాస్టర్లు రవినాయక్, శంకర్‌నాయక్, సలాం, నాని, పద్మాచారి, రఘువీర్‌ప్రతాప్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయికి ఎంపికవ్వాలి

» కలెక్టర్ బీఎం సంతోష్



క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల అర్బన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రికెట్ క్రీడాకారులు ఉత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపికయ్యేందుకు కృషి చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడి యంలో శేరెల్లి ప్రీమియర్ లీగ్ సీజన్-2 క్రికెట్ పోటీలకు కలెక్టర్ హాజరై బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ విద్యార్థి దశ నుంచే చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా మైదానాల్లో ప్రతిరోజు శిక్షణ పొందాలన్నారు. జిల్లాలో ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసేందుకు శేరెల్లి ప్రీమియర్ లీగ్ పోటీలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ పోటీలు ఈ నెల 9వ తేదీ వరకు కొనసాగుతాయని, ఈ టోర్నమెంట్‌లో మొత్తం ఆరు జట్లు తలపడనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అంతకుముందు శాంతి ప్రతీకలైన పావురాలను ఎగురవేసి పోటీలను ప్రారంభించారు. తహసీల్దార్ మల్లికార్జున్, డీవైఎస్‌వో జితేందర్, మాజీ కౌన్సిలర్, న్యాయవాది భీమ్‌సేన్‌రావు, శేరెల్లివీధి క్రీడాకారులు ఉన్నారు.

ఇంటర్వ్యూ..

డిజిటల్ సర్వే ద్వారా పంటల నమోదు

- వ్యవసాయ అధికారి కృష్ణయ్య



అచ్చంపేటటౌన్, ఫిబ్రవరి 2, (ఆంధ్రజ్యోతి) : డిజిటల్ సర్వే ద్వారా పంటల నమోదు కార్యక్రమం త్వరలో ప్రారంభిస్తామని, అందుకు రైతులు సహకరించాలని వ్యవసాయ అధికారి కృష్ణయ్య కోరారు. ఆదివారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

డిజిటల్ సర్వే ద్వారా పంటల నమోదు కార్యక్రమం ఎలా చేస్తారు ?

వ్యవసాయ విస్తరణ అధికారులు గ్రామాలలో రైతుల వ్యవసాయ పొలాల దగ్గర తన వ్యవసాయ భూమిని డిజిటలో నమోదు చేస్తాం. దానిద్వారా రైతులు వేసిన సులభంగా గుర్తించవచ్చు.

గతం కంటే ఈఏడాది రైతుభరోసా తగ్గిందా, పెరిగిందా ?

మండలంలో 44వేల ఎకరాల సాగుభూమి ఉండగా, 19 వేల మంది రైతులున్నారు. గతంకంటే ప్రస్తుతం 260 ఎకరాలు మాత్రమే తగ్గింది. మిగతా భూమికి రైతు భరోసా పడుతుంది.

బోనస్‌తో వరి సాగు పెరిగిందా?

గతేడాది మండలంలో 2500 ఎకరాలలో వరిసాగు చేస్తే ఈ ఏడాది దాదాపు 4500 ఎకరాలలో వరిసాగు చేసే అవకాశం ఉంది. వరి బోనస్‌తో పాటు ఈ ఏడాది వర్షాలు విస్తారంగా కురవడంతో సాగు పెరిగింది.

కొత్త పాసుపుస్తకాలు చేసుకున్న వారికి రైతుభరోసా వస్తుందా ?

కొత్తగా పాసుపుస్తకాలు పొందిన రైతులు గ్రామాలలో సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారికి జిరాక్స్ ప్రతులు అందించి నమోదు చేసుకోవాలి.

న్యూస్ బాక్స్

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం : కాంగ్రెస్

పెంట్లవెల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం 2024-25 సంవత్సరానికి రూపొందించిన బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కబీర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి తెలంగాణకు నిధులు తీసుకురావడంలో విఫలమయ్యారని ఆయన విమర్శించారు. ఏపీ, గుజరాత్ రాష్ట్రాలకు అధిక నిధులు కేటాయించారని తెలిపారు. వివక్ష లేకుండా కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు సమానంగా నిధులు కేటాయించాలని కోరారు.

వైద్యశిబిరం విజయవంతం

వెల్దండ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొట్ర గ్రామంలో హైదరాబాద్ అల్మాస్‌గూడ మెట్రో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు మల్లికార్జున్‌రెడ్డి, రాకేష్‌గౌడ్, శ్రీకాంత్, నిర్వాహకులు రమేష్‌గౌడ్, సురేష్ ఉన్నారు.

యూపీఎస్‌ను రద్దు చేయాలి

- సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల సైదులు

వంగూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : కేంద్రం ప్రభుత్వం ఏప్రిల్ 1 నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేయనున్న యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్‌ను వెంటనే రద్దు చేయాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం అసోసియన్ జిల్లా అధ్యక్షుడు వేముల సైదులు డిమాండ్ చేశారు. ఆదివారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా సీపీఎస్‌తో పోరాడుతున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేస్తామని చెప్పి నేటికీ అమలు చేయలేదని విమర్శించారు. ఏప్రిల్ నుంచి అమలు అయ్యే యూపీఎస్ వల్ల ఇంకా నష్టం ఎక్కువగా ఉందన్నారు. కార్యక్ర మంలో రాజేందర్, మల్లేష్, సుధారాణి, మల్లేష్ పాల్గొన్నారు.

విద్యా రంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి : బీఆర్‌ఎస్‌వీ

కొల్లాపూర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని బీఆర్‌ఎస్‌వీ జిల్లా నాయకుడు శేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం కొల్లాపూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వానికి పెట్టుబడిదారుల మీద ఉన్న సానుభూతి పేద విద్యార్థుల మీద లేకుండా పోయిందన్నారు. కేవలం 6 శాతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా శాఖకు కేటాయించి తీరని అన్యాయం చేస్తున్నారని అన్నారు. విద్యాశాఖకు కనీసం 30 శాతం నిధులు కేటాయించాలని కోరారు.

కరాటే మాస్టర్‌కు ఉత్తమ సేవా అవార్డు

కల్వకుర్తి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : హైకోర్టు న్యాయాధికారి ఈవీ వేణుగోపాల్ చేత కల్వకుర్తికి చెందిన కరాటే మాస్టర్ వేముల వెంకటేష్ అవార్డు అందుకున్నారు. కల్వకుర్తి చెందిన కరాటే మాస్టర్ కరాటే ఫెడరేషన్ ఆఫ్ చోటోఖాన్ ఇండియా ఆర్గనైజేషన్ అభివృద్ధి చేసి నందుకుగాను హైదరాబాద్‌లోని లయన్స్ క్లబ్ భవనంలో జరిగిన కార్యక్రమంలో హైకోర్టు న్యాయాధికారి అవార్డు అందజేశారు. కరాటేతో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని వెంకటేష్ అన్నారు. కార్యక్రమంలో కేఎఫ్ఎస్ ఇండియా ఫౌం డర్ గణేష్, రాష్ట్ర కేఎఫ్ఎస్ ప్రెసిడెంట్ రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎండి తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి

వేంకటేశ్వర స్వామి ఉత్సవాలు

కందనూలు/ వంగూరు/ ఉప్పునుంతల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : వంగూరు మండలం రంగాపూర్ తండాలో వేంకటేశ్వర స్వామి ఉత్సవాలు ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. రథసప్తమిని పురస్కరించుకొని ప్రతీ సంవత్సరం కనుల పండవగా ఉత్సవాలు నిర్వహిస్తారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. 3న స్వామి వారి కల్యాణం, 4న సత్యనారాయణ వ్రతాలు ఉంటాయి. సాయంత్రం కోట మైసమ్మ తల్లికి బోనాలు నిర్వహిస్తారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



వేంకటేశ్వర స్వామి ఆలయం ఈ ప్రాంతంలో ఎంతో ప్రసిద్ధి చెందింది. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ఆలయం వద్ద టెంట్లు, తాగునీరు, అన్నదానం వంటి కార్యక్రమాలు భక్తులకు ఏర్పాటు చేశాం.

- సల్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్

రేపు రథసప్తమి వేడుకలు

ఉప్పునుంతల మండల పరిధిలోని వెల్టూరు గ్రామంలో అలివేలుమంగ సమేత లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం నుంచి బుధవారం వరకు రథసప్తమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 4 ఉదయం 5.30 ధ్వజారోహణం, రాత్రి 7 గంటల వరకు వివిధ వాహన సేవలు, 8 గంటలకు స్వామి కల్యాణోత్సవం ఉంటుందని తెలిపారు. బుధవారం ఉదయం 5 గంటలకు రథోత్సవం ఉందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఇంటింటా శివస్వాముల పూజలు

కందనూలు : మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని మండల, అర్ధ మండల దీక్ష స్వీకరించిన శివస్వాముల ఇళ్లలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగర్‌కర్నూల్‌లోని ఈశ్వర్‌నగర్ కాలనీలో గుంపుల విజయ్‌కుమార్ శివస్వామి ఇంట్లో మాఘపంచమి ఆదివారం శివస్వా ములచే ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మల్లికార్జున, భక్తకన్నప్ప సన్నిధానం స్వాములు పాల్గొని శివనామస్మరణ భజనలు చేశారు. సామూహిక అన్నప్రసాద పంపిణీ చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు ఎం.రాం బాబు, కాలచంద్రశేఖర్, బాలస్వామి, శ్రీను, అడిమయ్య, శివ, లక్ష్మయ్య, యాదమ్మ, కల్పన పాల్గొన్నారు.



ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం



కందనూలులో ప్రత్యేక పూజలు చేస్తున్న శివస్వాములు

తెలంగాణకు తీవ్ర అన్యాయం

- కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రతుల దహనంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు



కొల్లాపూర్‌లో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్/ కొల్లాపూర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్పొరేట్ అనుకూల బడ్జెట్‌లో తెలంగాణ ఊసే లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు విమర్శించారు. ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కేంద్ర బడ్జెట్ 2025-26కు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వర్ధం పర్వతాలు మాట్లాడుతూ కేంద్ర మంత్రి ప్రవేశపెట్టిన పూర్తిగా కార్పొరేట్ శక్తులకు ప్రయోజనం చేకూర్చేలా ఉందని ఆరోపించారు. రాష్ట్రంలో బీజేపీకి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు, 8 మంది ఎమ్మెల్యేలు ఉన్నా బడ్జెట్‌లో మాత్రం నిధులు రాబట్టలేకపోవడం అవమానకరమన్నారు. కార్మికులు, వ్యవసాయ అనుబంధ రంగాలకు ఆశించినంత నిధులు కేటాయించపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.శ్రీనివాస్, నాయకులు రామయ్య, అశోక్, వెంకటేష్, మధు, సత్యం, ఆంజనేయులు, లక్ష్మయ్య నరసింహ, భాషా, వెంకటయ్య పాల్గొన్నారు. ● సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని గాంధీపార్కు వద్ద కేంద్ర బడ్జెట్ పత్రాలను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హమాలీ కార్మికులు వెంకటయ్య, విజయ్, సురేష్, బాలస్వామి, కృష్ణయ్య, రామస్వామి, శ్రీనివాసులు, వెంకటేష్ పాల్గొన్నారు.

కొల్లాపూర్‌లో బడ్జెట్ ప్రతుల దహనం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ కొల్లాపూర్ ఎన్‌టీఆర్ చౌరస్తాలో సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. వ్యవసాయ రంగానికి గతం కన్నా రూ.10వేల కోట్లు తగ్గించారని, ఎరువుల సబ్సిడీకి రూ.11 వేల కోట్లు తగ్గించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు ఎండీ సలీం, బత్తిని రాజు, మధు, సాయికుమార్, శంకర్, సత్యం నారాయణ, రాజు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతోనే మాదిగల జీవితాల్లో వెలుగులు

- రాష్ట్ర దళిత నాయకుడు మంగి విజయ్

బిజినేపల్లి/ ఊర్కొండ/ వంగూరు/ ఉప్పునుంతల/ లింగాల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణతోనే న్యాయమైన రిజర్వేషన్ ఫలాలు అందితేనే మాదిగల జీవితాల్లో వెలుగులు వస్తాయని దళిత నాయకుడు మంగి విజయ్ అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆదివారం ఎస్సీవర్గీకరణ అమలు చేయాలని కోరుతూ ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న "లక్షల డప్పులు వేల గొంతులు" కార్యక్రమంపై రూపొందించిన చలో హైదరాబాద్ కరపత్రాలను ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులతో కలిసి ఆయన విడుదల చేశారు. మన డప్పు, మన పాట ద్వారా ఎన్నో ఉద్యమాలకు ప్రాణం పోసి, నడక నేర్పి ఎన్నో విజయాలు సాధించామన్నారు. 50 ఏళ్లుగా ఏకపక్షంగా రిజర్వేషన్ ఫలాలను అనుభవిస్తున్న మాలలు ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తున్నారని, వారికి మనమంతా సంఘటితమై పోరాటం చేసి మన హక్కులను సాధించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు గూట విజయ్, కరిగళ దశరథం, మొల్గర మహేందర్, మంగి విల్సన్, విజయ్‌కాంత్, మంగి రాజు, శివ, శ్రీహరి, శేఖర్, రాజేష్ తదితరులు ఉన్నారు. ● ఊర్కొండలో కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారి వద్ద ఎమ్మార్పీఎస్ ఊర్కొండ మండల అధ్యక్షుడు రాధాకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నాయకులు 'లక్ష డప్పులు - వేల గొంతుకల' వాల్ పోస్టర్ విడుదల చేశారు. ● వంగూరు అంబేడ్కర్ చౌరస్తాలో ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు అంకూరి శ్రీశైలం ఆధ్వర్యంలో మహా ప్రదర్శన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ● ఉప్పునుంతల అంబేడ్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ ఉప్పునుంతల మండల అధ్యక్షుడు గుద్దటి రాజమౌళి ఆధ్వర్యంలో 'లక్ష డప్పులు-వేల గొంతుల' పోస్టర్లను విడుదల చేశారు. ● లింగాలలో ఎమ్మార్పీఎస్ మండల గౌరవ అధ్యక్షుడు బంగారయ్య ఆధ్వర్యంలో 'లక్ష డప్పులు- వెయ్యి గొంతుకలు' వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ప్రచార రథం లింగాలకు రాగా ధూం ధాం కళాకారుల ఆటపాటలు, డప్పు కళాకారులు వివిధ రకాల దరువులతో డప్పులు వాయించి అలరించారు.



బిజినేపల్లిలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర దళిత నాయకుడు మంగి విజయ్

బైపాస్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు

తాడూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : తాడూరులో నూతనంగా ఏర్పాటు చేస్తున్న జాతీయ రహదారికి సంబంధించిన బైపాస్ రోడ్డు అలైన్‌మెంట్‌ను తప్పనిసరిగా మార్చాల్సిందేన ని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి వర్ధం పర్వ తాలు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో బైపాస్ రోడ్డు వస్తున్న ప్రాంతం లో కోల్పోతున్న భూముల వద్ద సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. పేద దళితుల భూములు లాక్కోవడం సరికాద న్నారు. భూములు కోల్పోతుం డడంతో తాడూరుకు చెందిన శేఖర్, కురుమూర్తిలు ఆత్మహత్యాయత్నం చేసు కుని చావుబతుకుల మధ్య పోరాడుతున్నార న్నారు. ప్రస్తుతం ఉన్న అలైన్‌మెంట్‌ను మార్చి పేద దళితులకు చెందిన భూములను కోల్పో కుండా అధికారులు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, మండల కార్యదర్శి కాశన్న, మండల నాయకులు కాశన్న, శంకర్, బలరాం ఉన్నారు.



జిల్లా జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భూనిర్వాసిత రైతును పరామర్శిస్తున్న మాల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కూన గోవర్ధన్

బైపాస్ డిజైన్‌ను మార్చాలి

నాగర్‌కర్నూల్ టౌన్ : తాడూరు మండల కేంద్రంలో దళితుల భూమి కోల్పోకుండా 167కె బైపాస్ జాతీయ రహదారి డిజైన్‌ను మార్చాలని మాల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కూన గోవర్ధన్ డిమాండ్ చేశారు. జాతీయ రహదారి కోసం భూసేకరణ సర్వేతో ఆత్మహత్యాయత్నం చేసిజిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రైతులను కూన గోవర్ధన్ ఆదివారం పరామర్శించారు. దళితులని చూడకుండా ప్రభుత్వం ముందస్తు సమాచారం ఇవ్వకుండా భయభ్రాంతులకు గురి చేసి సర్వే పనులు చేపట్టడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో కూన నిరంజన్, శంకర్, కర్ణమూర్తి, మధు, బిజ్జ భాస్కర్, శ్రీను, మైబు, కాశీం, మధు, బాలరాజు, ప్రసాద్, వెంకటేష్, యాదగిరి పాల్గొన్నారు.

ఆత్మీయ భరోసా లబ్ధిదారుల ఎంపికలో అయోమయం

కోడేరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఆత్మీయ భరోసా లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలని సీపీఎం నాయకులు పి.నరసింహ అధికారులను కోరారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అధికారులు నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని గ్రామసభలోని లబ్ధిదారుల ఎన్నిక జరగాలని పేర్కొన్నారు. మండల కేంద్రంతో పాటు జనుంపల్లి, తీగలపల్లి, బావాయిపల్లి, ఎత్తం తదితర గ్రామాలలో లబ్ధిదారుల ఎన్నిక సరిగా లేదన్నారు.

ఘనంగా ఉపాధి హామీ పథకం ఆవిర్భావ దినోత్సవం



జిల్లా కేంద్రంలో మహాత్మాగాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎన్ఆర్‌ఈజీఎస్ ఉద్యోగులు

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆవిర్భావ దినోత్సవ వేడకలు ఆదివారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మండల పరిషత్తు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మహాత్మగాంధీ చిత్ర పటానికి ఎంపీడీవో కోటేశ్వర్ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకం ప్రారంభించి నేటికి 20 ఏళ్ల పూర్తి చేసుకుందని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం కార్యక్రమం ద్వారా గ్రామాల్లో కూలీలకు పనులు చూపించి జీవనోపాదులు కల్పించడంతో పాటు పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, రహదారులు, పండ్ల తోటలు, వర్మీకంపోస్టు షెడ్లు, మరుగుదొడ్లు వంటి అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఉద్యోగులు శ్రీనివాస్, క్రాంతి, రాజేష్, బాలయ్య, సత్యనాయరాయణ, బాలరాజు, మల్లికార్జున్, జీవన్‌కుమార్, ఇసాక్, నాగరాజు, మాదవాచారి, మహేందర్, మంజుల, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ గురు, శిష్యుల సమావేశం



ఇంద్రకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం జరుపుకుంటున్న

తాడూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : 1991-92లో మండలంలోని ఇంద్రకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వ గురు శిష్యుల సమావేశం నిర్వహించుకున్నారు. గురువులు సుజ్ఞానమూర్తి, సుధాకర్, జగపతిరెడ్డి, శ్రీనివాస్, హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, వీడీ శేఖర్‌బాబులను పూర్వ విద్యార్థులు శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. అంతకు ముందు వసంత పంచమి సందర్భంగా సరస్వతి మాత చిత్రపటానికి పూల మాలలు వేసి జ్యోతిప్రజ్వలన చేశారు. పాఠశాలకు వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు పూర్వ విద్యార్థులు ముందుకొచ్చారు. పూర్వ విద్యార్థులు వెంకటరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నిరంజన్, గోపాల్‌రావు, వర ప్రసాద్, శ్రీనివాస్, జంగయ్య, కరుణాకరరెడ్డి, రేవతి, రాధ, కమల పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికులకు రూ.12వేలు ఇవ్వాలి

- వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు జల్లాపురం సురేందర్



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు సురేందర్

కొల్లాపూర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : జాబ్ కా ర్డుతో సంబంధం లేకుండా వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి రూ.12వేలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్య క్షుడు జల్లాపురం సురేంద ర్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆదివారం కొల్లాపూర్ మండల పరిధిలోని ముక్కిడి గుండం గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. వర్తే గణేష్ అధ్యక్షతన 8 మందితో కూడిన గ్రామ కమిటీలో అధ్యక్షులు వర్తె గణేష్, ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి క్రాంతి కుమార్, ఉపాధ్యక్షులు శంకర్, సహాయ కార్యదర్శి రాముడు, సభ్యులు సేవ్య నాయక్, శ్రీను, శంకర్, గుడిసె కురుమయ్యలను ఎన్నుకున్నారు. సురేందర్ మాట్లాడుతూ... అర్హులందరికీ రేషన్ కార్డులు, పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంటి నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వం 5 లక్షలు, కేంద్ర ప్రభుత్వం 10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్, హరియా బొజ్జ, గంట వెంకటస్వామి, వెంకటరాములు, లౌడియా శంకర్, కురుమయ్య, గుడిసె శ్రీను, గుడిసె కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో యువకుడి సత్తా

- మూడవ స్థానం బ్రాంజ్ మెడల్‌తో అర్షద్‌కు సత్కారం



తైక్వాండో జాతీయ స్థాయి పోటీలలో బ్రాంజ్ మెడల్ సాధించిన మహమ్మద్ అర్షద్

కొల్లాపూర్/ నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీలలో పెంట్లవెల్లికి చెందిన మహమ్మద్ అర్షద్ జాతీయ స్థాయిలో సత్తా చాటి 3వ స్థానంలో నిలిచాడు. జాతీయ స్థాయి విజేతగా ఉన్న మహమ్మద్ అర్షద్‌ను తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి శ్రీహరి, బ్రాంజ్ మెడల్‌తో సత్కరించారు. ఈనెల 27వ తేదీ నుంచి 30 వ తేదీ వరకు హైదరాబాద్‌లోని యూసఫ్‌గూడ ఇండోర్ స్టేడియంలో తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీలలో అర్షద్ సత్తా చాటాడు. రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శి శ్రీహరి, జిల్లా కార్యదర్శి శేఖర్, జిల్లా సహాయ కార్యదర్శి రాజు యాదవ్, కోచ్ రామకృష్ణ, మిత్రులు అభినందిస్తున్నారు.

తైక్వాండో కలర్ బెల్ట్ పరీక్షలు

ఆదివారం జిల్లా కేంద్రంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తైక్వాండో కలర్ బెల్ట్ పోటీ పరీక్షలు విజయవంతమ య్యాయి. పట్టణంలోని జడ్పీ మైదానంలో నిర్వహించిన ఈ పోటీలలో బెల్టులు, సర్టిఫికెట్లు ప్రదానోత్సవ కార్యక్రమానికి జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు తెప్ప శ్రీను ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు అందజేశారు. అనన్యశ్రీ, నిత్యశైర్య నేహ, నమత్ ఎల్లో బెల్టు సాధించగా దివిజ, అర్జున్, సాయి మానస్విని, పాయి మనోజ్ఞ, సుమేద, సాయిమోక్ష ఎల్లో వన్ బెల్టులు సాధించారు. అదేవిదంగా సి.ప్రణీత, డి.వెంకటలక్ష్మి గ్రీన్ బెల్టులు సాధించగా కె.రితిక గ్రీన్ వన్ బెల్టులు సాధించారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసి యేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్, కోశాధికారి స్వాతి పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలు గుర్తింపునిస్తాయి

- బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బాలాజీ



మన్ననూరులో రోగులకు పండ్లను పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

అమ్రాబాద్/ మన్ననూర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల కోసం పోరాటాలు చేసిన రాజకీయ నాయకులను ప్రజలు ఎప్పటికీ గుర్తించు కుంటారని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మండికారి బాలాజీ అన్నారు. అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలో దివంగత బీజేపీ నాయ కుడు శంకర్ జీ మూడో వర్ధంతిని పురస్కరిం చుకొని బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం ఆసుప త్రులలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. బాలాజీ మాట్లాడుతూ బీజేపీలో సాధారణ కార్యకర్త నుంచి జిల్లా స్థాయి పదవుల్లో ఉంటూ నల్లమల ప్రాంత ప్రజల సమస్యలను నిత్యం ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేవారని అన్నారు. ఆయన స్మారక స్తూపాన్ని మన్ననూరులో ఏర్పాటు చేసేందుకు నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, నాయకులు లింగం, శేఖర్, శ్రీకాంత్, శ్రీనివాసులు, బాలకృష్ణ పాల్గొ న్నారు. ● మంగళగిరి శంకర్‌జీ వర్ధంతిని పురస్కరించుకొని అమ్రాబాద్‌లోని ప్రభుత్వ సివిల్ ఆస్పత్రిలో ఆ పార్టీ నాయకులు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు, అమ్రాబాద్ మండల అధ్యక్షులు గోలి రాజు, నేతలు చంద్రయ్య గౌడ్, సతీష్ కుమార్, చంద్రయ్య, శంకర్ గౌడ్, వెంకటేష్ పాల్గొన్నారు.

అద్భుతమైన బడ్జెట్

పెద్దకొత్తపల్లి : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ గతినే మార్చేలా ఉందని బీజేపీ మండల అధ్యక్షుడు దేశమోని పరశురాముడు అన్నారు. రూ.12లక్షల వరకు పన్ను మినహాయింపు విప్లవాత్మకమైన నిర్ణయమని అన్నారు.

కబడ్డీలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



క్రీడాకారులతో తైక్వాండో మహబూబ్‌నగర్ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి బాబూలాల్ నాయక్

కల్వకుర్తి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : కబడ్డీలో రాణిస్తే క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మహబూబ్‌నగర్ జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి ఒలింపిక్ జాయింట్ సెక్రటరి బాబూలాల్ నాయక్ పేర్కొన్నారు. ఆదివారం రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొనే జిల్లా జట్టుకు ఆయన క్రీడాదుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదిలాబాద్‌లో ఈనెల 4, 5, 6, 7 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా కబడ్డీ క్రీడాకారులు ఉన్నత ప్రతిభ కనబరచాలన్నారు. రాష్ట్ర స్థాయిలో పాల్గొనే జిల్లా జట్టుకు కల్వకుర్తి స్టేడియంలో నిర్వహించిన కబడ్డీ శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథు లుగా బాబూలాల్‌నాయక్, ఫిజికల్ డైరెక్టర్ ప్ర సాద్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మేకల శ్రీనివాస్ హాజరయ్యారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా క్రీడల చీఫ్ పాటర్న్, కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి క్రీడాకారులకు అందుబాటులో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ కోచ్ గణేష్, నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్గనై జింగ్ కార్యదర్శి రమేష్, జిల్లా కబడ్డీ అసోసి యేషన్ ప్రధాన కార్యదర్శి పీఈటీ యాదయ్య, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం

కల్వకుర్తి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరంలాంటిదని కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ అన్నారు. కల్వకుర్తి మునిసిపాలిటీ పరిధిలోని సంజాపూర్ గ్రామానికి చెందిన దొడ్ల పర్వతాలు అనారోగ్యంతో బాధపడుతుండగా ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సీఎంఆర్ఎఫ్ ఎల్‌వోసీ ద్వారా రూ. 40 వేలు మంజూరు చేశారు. ఆ ఎల్‌ఓసీని ఆదివారం బాధితుడికి ఇచ్చారు. కార్యక్రమంలో కల్వకుర్తి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, ఆనంద్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, చిన్న రాంరెడ్డి, చిత్తారి శ్రీను, లక్ష్మయ్య, ఆంజనేయులు, అల్లాజీ, యాదయ్య, జంగయ్య, హుసేన్, తిరుపతి, శివ, చిరంజీవి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

కల్వకుర్తి పట్టణానికి చెందిన షేక్.ఫరీద్ అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుని కుటుంబానికి ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేశ్ ఆర్థిక సహాయం సమకూర్చారు. ఆదివారం మృతుని కుటుంబానికి కల్వకుర్తి మాజీ మునిసిపల్ చైర్మన్ రాచోటి శ్రీశైలం, ఉప్పల చారిటబుల్ ట్రస్టు సభ్యులు ఆర్థిక సహాయం అందజేశారు. నాయకులు ధారమోని గణేష్, సత్యనారాయణ, భగత్‌సింగ్, మూర్తి, శ్రీను నాయక్, షకీల్, హనుమంతు నాయక్, సాదిక్, జావీద్, షేక్ బాబా తదితరులు ఉన్నారు. అదేవిధంగా మృతుని కుటుంబానికి మిత్ర ఫౌండేషన్ సభ్యులు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.